క్లుప్తంగా

పరామర్శ



మహాముత్తారం : మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన బీసుల పోషయ్య సోమవారం మృతి చెందగా అతడి కుటుంబాన్ని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలారం గ్రామానికి చెందిన వేల్పుల బానయ్య ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులున్నారు.

పంచాయతీ కార్యదర్శుల పని తీరు పరిశీలన



టేకుమట్ల : ప్రొబేషనరీ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శుల పని తీరును అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. మండలంలోని 13 గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తీరును అధ్యయనం చేశారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఎంపీఓ సురేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



మల్హర్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొయ్యూరు బొగ్గుల వాగు వంతెన సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంథని నుంచి భూపాలపల్లి దిశగా వస్తున్న మారుతి కారును కాటారం నుంచి తాడిచర్ల వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న మధుసింగ్, భగత్‌సింగ్ గాయాల పాలయ్యారు. మధుసింగ్‌ను పోలీసులు గోదావరిఖనిలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వడ్లకొండ సురేష్ తెలిపారు.

బీసీ సాయంలో వివక్ష తగదు

టేకుమట్ల : బీసీలకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల సాయం అమలులో వివక్ష తగదని మండలంలోని ఆశిరెడ్డిపల్లి సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. బీసీ కుల వృత్తులపై ఆధారపడ్డ పేదలకు లక్షల రూపాయల సాయాన్ని ప్రభుత్వం ప్రకటించగా గ్రామంలో 16 మంది దరఖాస్తు చేసుకోగా కొందరు బీఆర్ఎస్ నాయకులు పక్షపాత ధోరణితో పేద కుటుంబానికి సాయం అందకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. అలాంటి వాళ్ల వల్ల సీఎం కేసీఆర్ సదుద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకం నీరుగారే ప్రమాదం ఉందన్నారు. బీఆర్ఎస్‌లో తప్పుడు సంకేతాలతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని అభాసు పాల్జేసేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి నిష్పక్షపాతంగా పేదలకు ఖచ్చితంగా లబ్ధి చేకూరేలా చూడాలని కోరారు.

ప్రమాదకర గుంతల పూడ్చివేత



కాటారం : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో, కాటారం–భూపాలపల్లి జాతీయ రహదారి మీదున్న ప్రమాదకర గుంతలను ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం పూడ్చివేయించారు. గుంతల కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారు. వర్షాకాలంలో గుంతలు కనిపించక వాహనదార్లు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రమాదాలను, వాహనదారుల ఇబ్బందులను తొలగించేలా గుంతలను కంకరతో పూడ్చి చదునుగా చేయించారు.

'కేంద్ర' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● గోవా ఎమ్మెల్యే ఉల్లాస్ యశ్వంత్ యోంకర్



చిట్యాల : మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే ఉల్లాస్ యశ్వంత్ యోంకర్

చిట్యాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోవా ఎమ్మెల్యే ఉల్లాస్ యశ్వంత్ యోంకర్ బీజేపీ శ్రేణులకు సూచించారు. మండలంలోని జూకల్ గ్రామ శివారులోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన' కార్యక్రమంలో భాగంగా బూత్, మండల స్థాయి నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉల్లాస్ యశ్వంత్ యోంకర్ హాజరై మాట్లాడారు. తాను బూత్ స్థాయి నుంచి 20 ఏళ్లుగా పని చేస్తూ ఎమ్మెల్యేగా ఎదిగినట్టు తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో మహిళా రిజర్వేషన్ అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం వాటా ఉండాలని ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షలు చేశారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ మహిళా రిజర్వేషన్ పాటించకపోవడంపై ఎమ్మెల్సీ కవిత సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మహిళలకు సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిషీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి మోర్తెల రాజేందర్, నాయకులు రవికిరణ్, మాచర్ల రఘు, అనిల్, రవీందర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల (రేగొండ) : మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గోవా ఎమ్మెల్యే ఉల్లాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మిర్చి రైతులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రసాద్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ఉపాధ్యక్షులు కాంతాల సరోత్తంరెడ్డి, సుదాటి వేణు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి



కాటారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుశాంత్

కాటారం : దళితులకు మూడెకరాల భూమి, దళిత సీఎం, తదితర హామీలతో అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించిన సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను అసోం బీజేపీ ఎమ్మెల్యే సుశాంత్ కోరారు. మండల కేంద్రంలో కాటారం, మల్హర్ మండలాల శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీల అధ్యక్షులు, సీనియర్ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైనట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణ కోసం జీవితం త్యాగం చేసిన చంద్రుపట్ల సునీల్‌రెడ్డికి 2014లో బీఆర్ఎస్ టికెట్ ఇవ్వకుండా అమ్ముకున్నారని సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. ఎలాంటి త్యాగాలు చేయకుండా అవినీతికి పాల్పడ్డ పుట్ట మధుకు టికెట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం సుమారు వంద మంది ఎమ్మెల్యే సుశాంత్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, ఉడుముల విజయరెడ్డి, పోతరవేణి క్రాంతి, నాంపెల్లి రమేశ్, ఎడ్ల సదాశివ్, పూసాల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్రకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల : భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంగళవారం నాడు స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు సంగి రవి, సంపత్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, చదువు మహేందర్, బందెల నరేష్, మంద రవి, మహ/ పాల్‌రెడ్డి, గండం సారయ్య, కూర సురేందర్‌రెడ్డి, పెరుమాండ్ల మొగిళి, నల్లబెల్లి రవీందర్, అడగాని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్

భూపాలపల్లి రూరల్ : రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సరికాదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు కొత్తూరి రవీందర్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్ల్ మార్క్స్ కాలనీలో మంగళవారం నిర్వహించిన "గడపగడపకు ధర్మసమాజ్ పార్టీ" కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడచినా 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్య, వైద్యం, ఉపాధి, తదితరాలు అందని ద్రాక్షగానే మిగిలాయని చెప్పారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా డబ్బులు, మద్యం ఇచ్చి ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. అగ్రవర్ణ కులాల ప్రభుత్వాలు అందిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పార్టీ పోరాడుతుందని తెలిపారు. ప్రజల్లో మార్పు కోసమే కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, ప్రవీణ్, హరీష్, గణేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వం ఇస్తున్న ప్రవీణ్, నాయకులు

టేకుమట్ల : ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నికలకు ముందే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ మండల అధ్యక్షుడు బుచ్చిరాములు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు, పీఆర్సీ బకాయల చెల్లింపు, తదితర సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల ముందే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదయ్య, నాగరాజు, వింధ్యారాణి, రూపశ్రీ, రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● బీజేపీ ఒడిశా ఎమ్మెల్యే నారాయణరావు



మాట్లాడుతున్న నారాయణరావు

ములుగు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ ఒడిశా ఎమ్మెల్యే కోదూరి నారాయణరావు అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా బీఆర్ఎస్ ప్రకటించిన జాబితాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రధాని మోదీ మాత్రం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు 90 శాతం నిధులను కేటాయిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారని వివరించారు. నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆదివాసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, మండల అధ్యక్షుడు తేజరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బిలరాం, రుద్రారపు సురేష్, రమేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

● ములుగు ఎమ్మెల్యే సీతక్క



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న సీతక్క

వెంకటాపురం(ఎం) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క తెలిపారు. మండలంలోని రామానుజాపూర్, నర్సాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా సీతక్క వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్‌లో బుర్రి స్వామి, డొక్కల రామచంద్రు, మైస నరేష్, పెండేల రాజు, మాదాసు కుమారస్వామి, శంకర్‌తోపాటు 20 మంది కార్యకర్తలు చేరినట్టు తెలిపారు. అనంతరం ఇటీవల గాయపడ్డ రామానుజాపూర్ గ్రామానికి చెందిన కన్నబోయిన రాజు, ప్రస్తుత సర్పంచ్ రాజిరెడ్డిని సీతక్క పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి నాయకులు బండి శ్రీనివాస్, నల్లెల్ల భరత్‌కుమార్, పటేల్ రమణారెడ్డి, చక్రపు శ్రీనివాస్, దేవ్‌సింగ్, రాంబాబు, సాదు రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

మంగపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని ఎస్సై రవికుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో సెల్‌ఫోన్లు వినియోగించే ప్రతీ ఒక్కరూ సైబర్ నేరాలపై చైతన్యవంతం కావాలని సూచించారు. దేశంలో తరచూ ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతూనే ఉందన్నారు. సరైన అవగాహన లేనప్పటికీ పలువురు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగానే సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు గురౌతున్నారని తెలిపారు. అపరిచితులకు ఓటీపీ, ఇతర సమాచారం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు 'బీఆర్ఎస్' ప్రాధాన్యం



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి సుధీర్

ములుగు : కులవృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిందని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14 బీసీ కులాలకు చెందిన 59 మంది పేద బీసీలకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను మంగళవారం ఆమె అందించి మాట్లాడారు. బ్యాంకు లింకేజీ లేకుండా రుణాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. గీత వృత్తిదారులకు పన్ను మాఫీతోపాటు ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా కూడా పెంచారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ ఇక్బాల్, సూపరింటెండెంట్ భాస్కర్, జన్నారపు శ్రీను పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలని వినతి



పూలు, వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

కాటారం : ఉద్యోగాలను రెగ్యూలరైజ్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సమ్మెకు సహకరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు సహకకరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మొదటి ఏఎన్ఎంకు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలాగే పూలు అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సెకండ్ ఏఎన్ఎంలకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ మద్దతు పలికి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సెకండ్ ఏఎన్ఎంలు సమ్మె చేస్తుండగా వారి విధులను ఫస్ట్ ఏఎస్ఎంలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు నిర్వహించడం సరికాదన్నారు. సెకండ్ ఏఎన్ఎంల సమ్మెకు సహకరించి ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు సరళ, రజిత, రజిని, శ్యామల, విజయలక్ష్మీ, శ్యామలత, సునీత, స్వరూప, రాణి తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' ఎంపికలో పారదర్శకత పాటించాలి



వినతిపత్రం ఇస్తున్న మహేందర్, తదితరులు

కాటారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం నివారించాలని సూచించారు. లబ్ధిదారులకు అన్యాయం జరిగి అనర్హులకు గృహలక్ష్మి మంజూరైతే ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల బాధ్యుడు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు

● వాల్‌పోస్టర్ల అవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్ : ఈనెల 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 16వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పక్షాన యూనియన్ 1942 నుంచి పోరాటాలు చేస్తోందని తెలిపారు. అనేక హక్కులు సాధించుకున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతోపాటు భవిష్యత్ కార్యాచరణపై మహాసభల్లో చర్చిస్తారని వివరించారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా పోరాడే దిశగా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో నాయకులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు రాంచందర్, శ్రీనివాస్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



వాహన డ్రైవర్లను పరీక్షిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని ఎస్సై గట్ల సుధాకర్ వాహనదారులను కోరారు. మండలంలోని రామకిష్టాపూర్(టి)–చిట్యాల ప్రధాన రహదారిలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారి వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని, కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ సుమన్, టీఎస్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో సూపరింటెండెంట్ తనిఖీ



తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్

కాటారం : మండలంలోని రేగులగూడెంలోని తపాలా శాఖ కార్యాలయాన్ని పెద్దపల్లి జిల్లా సూపరింటెండెంట్ ప్రభాకర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి బ్రాంచ్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. తపాల శాఖ ద్వారా అందుతున్న సేవలను గ్రామాల్లో విస్తృత పర్చడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సీఎం సానుకూలం



సీఎం కేసీఆర్‌తో పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి

కాటారం: కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తెలిపారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థిగా పుట్ట మధును ఖరారుచేసిన సందర్భంగా పుట్ట మధుతో పాటు జక్కు శ్రీహర్షిణి మంగళవారం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించినట్లు శ్రీహర్షిణి తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, పూదరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.